# పలుకురాళ్ళు

తెల్లవారేసరికి ఊరంతా గుప్పుమంది! ఎవరినోటవిన్నా ఇదేమాట?! చిన్న పెద్ద పిల్ల పాప ఆడ మొగ, ముసలి ముతక అంతా ఎక్కడపని అక్కడే విడచి పెట్టి గచ్చులమడివేపు దౌడుతీసారు ఒకర్ని తోసుకుని ఒకరు ముందుకు వెళ్ళి చూస్తున్నారు పిరికి గుండెవాళ్ళు వందగజాల దూరంలో నిల్చుని గుంపువేపు చూస్తున్నారు. వెనుతిరిగి వస్తున్నవాళ్ళను "ఏమిటని" అడిగి వాళ్ళు చెప్పింది శ్రద్ధగా వింటున్నారు.

అందరికన్నా ముందు అదృశ్యం చూసి ఊరందరికీ ఆ వార్త అందజేసిన యానాది గురవయ్య అక్కడ చేరిన వారందరికీ తను మొదట ఎలా కనుగొంది మొదలైన విషయాలన్నీ గొప్పగా చెప్తున్నాడు.

"ఊరికేదో చెడుకాలం దాపురించింది! లేకుంటే యిటువంటి విపరీతం జరుగదు".

"పుట్టెరుగం ఇంతదారుణం!"

"ఇంత ఘోరమెప్పుడూ జరుగలేదు వూర్లోకి పులివచ్చి తోట పెద్దును వేసుకు పోయిందంటే..... యింతకన్న ఘోరం యింకేమైనా వుందా?!"

తలొకడు తమకుతోచిన విధంగా అనుకుంటున్నారు.

వేపాడు గ్రామం ఏనుగు కొండలను ఆనుకొని వుంది. అంతా నాలుగొందలగడప. ఊరుప్రక్క నుంచే అమృతవాహిని ప్రవహిస్తోంది. ఆ గ్రామవాసులంతా ఆ గంగమ్మ తల్లినే నమ్ముకున్నారు. తల్లి తన బిడ్డలకెప్పుడూ అన్యాయం చెయ్యలేదు. మండువేసవిలో కూడ ఆ నదిలో నిలువులోతు నీరుంటుంది.

ఏనుగుకొండలకవతల ప్రక్క పులులు, ఎలుగు బంట్లు వున్నాయంటారు. అవెప్పుడూ కొండదిగి యివతలివేపు వున్న గ్రామంలోకి రావు. ఏతోడేలో, నక్కో దారితప్పి వూర్లో కొచ్చినా, వూరి వేట కుక్కల కన్ను కప్పి ప్రాణాల్తో బైటపడలేదు.

కాని గతరాత్రి పులి ఒకటి వూర్లోకొచ్చి కామయ్యగారి తోటపెద్దును చంపి గచ్చులమడి లోకి ఈడ్చుకొనిపోయి సహం తినివిడిచి పెట్టింది.

యానాది గురవయ్య వుదయాన్నే పొలానికి వెళ్తూ గచ్చుల మళ్లో పులితిని విడిచిపెట్టిన తోట పెద్దు కళేబరాన్ని చూశాడు. గుండె బేజారై వూర్లోకి పరుగెత్తి ఆ వార్త చెప్పాడు.

పెద్దల ఆదేశానుసారం కామయ్యగారు తోట పెద్దు కళేబరాన్ని భూస్థాపితం చేయించారు.

పులి నెలాగైనా ఆరాత్రే చంపాలని నిశ్చయించుకున్నారు ఆరోజు పశువుల్ని కొండకు మేతకు తోలుకెళ్ళొద్దన్నారు.

ముత్యాలరావు ఆవూరి కామందు. వందెకరాల మాగాణీవుంది. అతడి దగ్గర మంచి తుపాకీ వుంది. పులివేటలో బాగా ఆరితేరినవాడు. ముత్యాల రావును ఆరాత్రే వేటకు సిద్ధంకమ్మని చాల మంది ప్రోత్సహించారు. లేకుంటే తమ పశువుల్ని కట్టుకొయ్యలు విప్పలేమన్నారు. అంతే కాక మనుషులక్కూడ ప్రమాదమని తమ భయాన్ని వెల్లడించారు.

ముత్యాలరావు "సరే"! నన్నాడు.

ముత్యాలరావుకు తుపాకీ పట్టడం నేర్పింది సిపాయి సింహాద్రి. సిపాయి సింహాద్రి మిల్ట్రీలో పనిచేసాడు. యుద్ధంలో అతడి కాలుపోయి కర్రకాలు వచ్చింది. యుద్ధం ముగిశాక వేపాడులో మంచి పల్లం భూమి పదెకరాలు, ఓ 5 వేల రూపాయల నగదు యిచ్చి సింహాద్రికి జీవనోపాధి కల్పించారు సర్కారువారు.

సింహాద్రి తన పదేళ్ళ కొడుకు వీర్రాజుతో వేపాడు కాపురం వచ్చాడు. సింహాద్రి తన మంచి తనంతో వూరివారందరి అభిమానం చూరగొన్నాడు, ఊరికి కొంచెం ఎడంగా తన పొలంగట్టునే చిన్నయిల్లు కట్టుకున్నాడు.

వీర్రాజు, ముత్యాలరావు యిద్దరూ ఒకే యీడు వాళ్ళు. అన్నదమ్ముల్లా కలసి మెలసి తిరుగుతూ ఒకర్ని ఒకరు క్షణమేనా విడచివుండేవాళ్ళుకాదు. ముత్యాల్రావు సింహాద్రిని సిపాయి బాబయ్యా! అని పిల్చేవాడు. సింహాద్రి వాళ్ళిద్దరినీ చేరదీసి తన మిల్ట్రీ వింతలెన్నో కథలుగా చెప్పేవాడు. ఇద్దరకి తుపాకి పట్టడం, గురిచూసి పేల్చడం నేర్పాడు.

సింహాద్రి దగ్గర రెండు రైఫిల్స్ వుండేవి. సింహాద్రి వీర్రాజునో యింటివాడ్ని చేసి కళ్ళు మూసాడు. వీర్రాజుకు ఆడపిల్ల పుట్టింది. గౌరి అని పేరుపెట్టాడు. తల్లిలేని గౌరిని ఎంతో గారాబంగా పెంచాడు.

ముత్యాలరావు తన ఒక్కగానొక్క కొడుకు రామారావును పట్నం చదువుకు పంపాడు.

ముత్యాలరావు. వీర్రాజు ఓరోజు పట్నం వెళ్ళారు పట్నంలో వీర్రాజు తన కూతురు కోసం మంచి లంగా, వోణి అవి కొన్నాడు. వీర్రాజు ఎంత వారిస్తున్నా వినకుండా గౌరికోసం వందరూపాయలు పెట్టి జడగంటలు కొన్నాడు ముత్యాలరావు.

"నాకు ఆడసంతానం లేదుకదా! నాముచ్చట కూడతీరనీ!" అన్న ముత్యాలరావును కాదనలేకపోయాడు వీర్రాజు.

సాయంత్రం ఏడుగంటలకు వాళ్ళు పట్నం నుంచీ తిరిగివచ్చేరు. "కాస్సేపు కూర్చుని వెళ్దువుగాని" రమ్మని ముత్యాలరావును పిల్చేడు వీర్రాజు. వారు గుమ్మంలో అడుగుపెట్టేసరికి ఇంట్లోంచి సన్నంగా మూలుగువినిపించింది. చేతిలోవున్న వస్తువులు క్రిందపడవేసి యింట్లోకి పరుగెత్తారు ఇద్దరూ ఇల్లంతా చీకటిగావుంది. ఎక్కడా లైటులేదు. వీర్రాజు అగ్గిపుల్ల గీసి లాంతరు వెలిగించాడు.

లోపలి దృశ్యం చూసి అదిరిపడ్డారు యిద్దరూ. సామానంతా చిందర వందరగా వుంది. గౌరి నేల మీదపడివుంది. సన్నంగా మూలుగుతూ అస్పష్టంగా ఏమిటో అంటూంది.

తన కూతురు స్థితికి గుండె తరుక్కుపోయింది వీర్రాజుకు. దోసిడితో నీళ్ళు తెచ్చి కూతురు ముఖంమీద చిలకరించాడు. గౌరి కొద్దిసేపట్లో తెప్పరిల్లి మెల్లగాకళ్ళు తెరిచి తండ్రి ముఖంలోకి చూసి బావురుమంది.

"ఏం జరిగిందమ్మా! నీకేం భయంలేదు చెప్పు తల్లీ!" అన్నాడు వీర్రాజు.

"నీ ఒంటి మీద చెయ్యివేసినవాడు బ్రతికి బైటపడ్డు!" అన్నాడు ముత్యాలరావు ఆవేశంగా.

"నేనెంత బ్రతిమాలుతున్నా.... వినకుండా ..... బలవంతంగా .... నన్ను......

"ఎవడమ్మా నీచుడు అంత సాహసించేడు. చెప్పువాడిని యిప్పుడే ముక్కలు ముక్కలుగా నరికి పోగుపెడతాను" కోపంతోపళ్ళు పటపట కొరికాడు వీర్రాజు.

"రామా.... రావు......." అంది గౌరి వూపిరి బిగపట్టి.

"రామారావా"

"మావాడా!? " అన్నాడు ముత్యాలరావు ఆశ్చర్యంగా.

గౌరి అవునన్నట్లు తలూపి మెడలు ప్రక్కకు వాల్చేసింది.

ముత్యాలరావు కోపంతో కంపించి పోయాడు అక్కడ యింకోక్షణమైనా నిల్చోలేక వెంటనే యింట్లోంచి బయల్దేరాడు.

రెండు సంవత్సరాలిట్టే దొర్లిపోయాయి. ఈ రెండు సంవత్సరాలు ముత్యాలరావు తన ముఖం వీర్రాజుకు చూపించలేకపోయాడు. తన కొడుకు చేసిన పనికి తను నలుగుర్లో తలెత్తుకు తిరుగలేకపోతున్నాడు.

ఈరోజు మళ్ళీ సాహసించి వీర్రాజు ఇంటికి బయల్దేరాడు ముత్యాలరావు.

వీర్రాజు యింటి ముందు వాకిట్లో మంచం మీద వెళ్ళకిలా పడుక్కుని పరధ్యాన్నంగా వున్నాడు.

"ఏం వీర్రాజూ! బావున్నావా!" అన్న ముత్యాలరావు మాటలకు అదిరిపడి లేచి కూర్చున్నాడు వీర్రాజు.

"రావోయ్! ముత్యాలూ కూర్చో! ఏమిటి విశేషాలు?!" అన్నాడు పేలవంగా నవ్వి.

"ఆఁ! ఏంలేదు నీకు తెల్సేవుంటుంది. రాత్రి వూర్లోకి పులివచ్చింది. పాపం

కామయ్యగారి తోటపెద్దను చంపింది."

"అవును యిప్పుడే నేనూ విన్నాను!"

"ఈ రాత్రి మాటువేసి కాద్దామంటున్నారు మనవాళ్ళు. లేకుంటే యింకేమైనా ప్రమాదం సంభవించవచ్చు. నువ్వుకూడా తప్పకుండారావాలి! అన్నాడు ముత్యాలరావు వీర్రాజు కళ్ళల్లోకి చూస్తూ.

వీర్రాజు కొన్ని నిముషాలు మౌనం వహించాడు.

"సరే నీ యిష్టం కాని"

"రాత్రి మాయింట్లో అందరకూ భోజనం ఏర్పాటు చేస్తున్న. నువ్వు తప్పకుండా రావాలి కాదనకు."

"నీకు తెలియదా ముత్యాలూ నేను రాత్రిళ్ళు భోజనం మానివేసి చాలకాలం అయింది."

"కొద్దిగా ఫలహారం....."

"నన్ను మొహమాటం పెట్టకు ముత్యాలు! మీరు బయల్దేరేవేళకు కబురు పంపు నేను సిద్ధంగావుంటాను" అన్నాడు వీర్రాజు.

ముత్యాలరావు వేటకు ఎప్పుడూ ఒంటరిగా పోలేదు. కూడా వీర్రాజు వుండి తీరాల్సిందే. తనకన్న వీర్రాజుకు వేటలో ఎన్నో మెళుకువలు తెల్సని ముత్యాలరావు నమ్మిక.

ముత్యాలరావు వెళ్ళగానే వీర్రాజు రైఫల్ తెచ్చి శుభ్రంగా క్లీన్ చేసాడు. మేగజైన్ నిండా తూటాలు నింపి సేఫ్టీలాక్ వేసి సిద్ధంగా వుంచాడు.

రాత్రి పది గంటలకు వీర్రాజు. ముత్యాలరావు. మరో పదిమంది ఆయుధాలతోను, వేట సామగ్రితోను కొండకు బయల్దేరారు. మూల మానుపై మంచెలాటిది కట్టి దానిమీద కూర్చున్నారు. కొండదిగి ఏజంతువైనా వూర్లోకి రావడానికి అనువైన మార్గం అదే. అంతా నిశ్శబ్దంగా తమ అయుధాలను పట్టుకొని రడీగా కూర్చున్నారు.

మూలమానుకు కొద్దిదూరంలో చిన్న చెట్టుకు కట్టిన మేకపిల్ల అరుపులు వుండి వుండి కొండలు ప్రతిధ్వనిస్తున్నాయి.

మూడు గంటకాలం దొర్లిపోయింది. ఉన్నట్టుండి కెవ్వుమన్న కేక వెనువెంటనే బరబరమని ఎండుటాకులపై శబ్దం వినిపించింది వారికి. ముత్యాలరావు చేతిలో తుపాకి వెంటనే పొగలు గ్రక్కింది. రెండో మారు కూడా ముత్యాలరావు గురి చూసి పేల్చబోయే సరికి వీర్రాజు వారించాడు.

కొద్దిక్షణాలు ఆగి అంతా చెట్టుదిగి కాగడాలు వెలిగించి కేక వినవచ్చినవేపు బయల్దేరారు. వందగజాల దూరంలో వారికి నేలమీదపడి వున్న మానవాకారం ప్రక్కనే గుండుదెబ్బకు చచ్చిపడి వున్న పులి కంటపడింది.

వీర్రాజు కాగడా వెల్తుర్లో మనిషి ముఖం గుర్తుపట్టాడు.

"రామారావు" అన్నాడు ఆశ్చర్యంగా.

ముత్యాలరావు ఒక అడుగుముందుకు వచ్చి ఒంగి కొడుకు ముఖంలోకి చూశాడు. మెడమీద పళ్ళగంట్లులోపుకు నాటుకున్నాయి.

"అవును ఆనాడు అమాయకురాలైన గౌరి జీవితం నాశనం చేసి యిల్లువిడచి పరారై యీనాడు పులివాత పడ్డాడు. నేటితో మనవూరి పీడవదలి పోయింది" అన్నాడు ముత్యాలరావు కోపంగా.

'చిత్రగుప్త' *15.8.1953.*